



జవహర్‌లాల్ నెహ్రూ 133వ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి నవీన్‌కు ఫ్రెండ్షిప్ బాండ్‌లు కట్టారు. పుష్పగుచ్ఛాలు అందించారు. విద్యార్థులకు కలెక్టర్, జెసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం



రమేష్, సంకల్ప్ మృతదేహాలు





నుజ్జునుజ్జయిన కారు

- రైలింగ్‌ను ఢీకొన్న కారు
- వైద్యునితో పాటు కుమారుడు మృతి
- భార్య, కుమార్తెకు తీవ్ర గాయాలు
- స్వగ్రామం అమలపాడులో విషాదఛాయలు

రెప్పపాటులో ప్రమాదం

ఎందరో ప్రాణాలను కాపాడిన ఆ వైద్యుడిని, ఆయన కుమారుడిని నిద్ర మత్తు రోడ్డు ప్రమాదం రూపంలో బలిగొంది. మరో పది నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకోవాల్సిన వారు మృత్యుఒడికి చేరుకున్నారు. కుటుంబంతో సహా విశాఖ నుంచి తిరిగొస్తుండగా, నిద్ర మత్తులో రెప్ప వాల్చడంతో రోడ్డు పక్కన రైలింగ్‌ను వారు ప్రయాణిస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. నందిగాం మండలం పెద్దనాయుడుపేటలో సోమవారం వేకువజామున సంభవించిన ఈ ఘటనలో పలాస ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మడే రమేష్ (45), ఆయన కుమారుడు సంకల్ప్ (10) అక్కడికక్కడే మృతి చెందారు. అదే ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న ఆయన భార్య లక్ష్మీప్రసన్న, కుమార్తె స్థైర్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారి మృతితో స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం అమలపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరికీ అప్తుడైన వైద్యుడు దూరం కావడంతో ఊరంతా శోకసంద్రమైంది.

ప్రజాశక్తి - నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస

విశాఖపట్నంలోని బంధువుల ఫంక్షన్‌కు కుటుంబంతో సహా వెళ్లిన రమేష్ సోమవారం వేకువజామున పలాసకు తిరుగు ప్రయాణమయ్యారు. మరో పది నిమిషాల్లో వారు తమ గమ్యస్థానానికి చేరుకోవాల్సి ఉండగా, నందిగాం మండలం పెద్దనాయుడుపేట వద్దకు వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న కారు జాతీయ రహదారి పక్కన రైలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ చేస్తున్న డాక్టర్ రమేష్, ఆయన పక్కన కూర్చొన్న కుమారుడు సంకల్ప్ అక్కడికక్కడే మృతిచెందారు. ఆయన భార్య లక్ష్మీప్రసన్న తలకు గాయం కాగా, కుమార్తె స్థైర్య కాలు ఫ్యాక్చర్ అయింది. కొద్దిసేపటికి తేరుకున్న లక్ష్మీప్రసన్న తన ఫోన్‌తో 108కు సమాచారం ఇచ్చారు. 108తో పాటు హైవే పెట్రోలింగ్, సమీప గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీసేసరికే రమేష్, సంకల్ప్ మృతి చెంది ఉన్నారు. గాయపడిన తల్లీ కుమార్తెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని శ్రీకాకుళంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. రమేష్ సూపరిటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రభుత్వాస్పత్రికి మృతదేహాలను తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం అమలపాడుకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు.



రమేష్ (ఫైల్ ఫొటో)

శోక సంద్రంలో అమలపాడు

వజ్రపుకొత్తూరు మండలం అమలపాడుకు చెందిన రమేష్ సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి వైద్య విద్యను అభ్యసించారు. ఆయనకు 15 ఏళ్ల కిందట తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన లక్ష్మీప్రసన్నతో వివాహమైంది. రమేష్ విశాఖ కెజిహెచ్, నరసన్నపేట, అక్కుపల్లి, కొర్లాం, హరిపురం ఆస్పత్రుల్లో పనిచేశారు. 2019లో పలాస ప్రభుత్వాస్పత్రి సూపరిటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆస్పత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. కోవిడ్ సమయంలో ఆయన అందించిన సేవలకు గానూ అవార్డును అందుకున్నారు. ఆయన భార్య లక్ష్మీప్రసన్న కూడా ఇదే ఆస్పత్రిలో స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులుగా పనిచేస్తున్నారు. అందరితోనూ సఖ్యతగా ఉంటూ, సాయం చేసే రమేష్ ఇక లేరన్న చేదునిజాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు మృతదేహాలను గ్రామానికి తీసుకురాగా రమేష్ తల్లి సాయమ్మతో పాటు గ్రామస్తులందరూ భోరున విలపించారు. రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు రమేష్ మృతదేహానికి నివాళ్లర్పించారు. చదువుకునే రోజుల నుంచి సహచర వైద్యునిగా తనకు బాగా పరిచయస్తుడైన మిత్రుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించారని కొనియాడారు. వైద్యపరంగా అందరికీ అందుబాటులో ఉండే మంచి వ్యక్తిని కోల్పోయామని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. పలాస మున్సిపల్ ఛైర్మన్ బి.గిరిబాబు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి యు.ఉదయ్ కుమార్, వైస్ ఎంపిపి వంక రాజు తదితరులు నివాళ్లర్పించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డబ్బీరు భవాని శంకర్, ఆస్పత్రి వైద్యులు మున్సిపల్ మాజీ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు తదితరులు సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, తదితరులు

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

- లేకుంటే 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర
- డిఆర్‌ఒ రాజేశ్వరికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక సంబంధమైన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ డిమాండ్ చేశారు. పిఎఫ్, ఎపిజి, ఎల్ఐ, డిఎ ఎరియర్లు, సరెండర్ లీవులు, రిటైర్డ్ ఉద్యోగుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ, ఎరియర్స్, ఏరండ్ లీవ్, ఎన్‌క్యాష్మెంట్, గ్రాట్యూటీ, కమిటేషన్ బకాయి, తదితర బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌సి చర్చల సందర్భంగా ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో 2022 మార్చి నాటికి ఆర్థిక బకాయిలన్నింటనీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జులైలో కొద్దిపాటి పిఎఫ్ మొత్తం తప్ప, మిగిలిన ఆర్థిక బకాయిలు ఏమీ ఇప్పటివరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. జిల్లాలో సుమారు రూ.160 కోట్లకు పైబడి, రాష్ట్ర వ్యాప్తంగా రూ.రెండు వేల కోట్లకు పైబడి బకాయి చెల్లించాల్సి ఉందని చెప్పారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, వివాహాలు నిలిచిపోయాయని, ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు లేక అప్పులు చేస్తున్నారని వాపోయారు. ఈ బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఈ ధర్నాలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, జి.సురేష్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.రవికుమార్, నాయకులు ఎల్.కోదండరామయ్య, బి.క్రాంతి కుమార్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. ఈనెల 13 నుంచి 21 వరకు చైల్డ్‌లైన్ సే దోస్తు అనే కార్యక్రమంలో భాగంగా చైల్డ్‌లైన్ సంస్థ నిర్వహిస్తున్న వారోత్సవాల్లో బాలల రక్షణ, హక్కుల పరిరక్షణ, బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలనే ఉద్దేశంతో ప్రచురించిన పోస్టర్‌ను నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, రక్షణ కోసం పనిచేస్తున్న విభాగాల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో బాలలతో స్నేహపూర్వకంగా మెలిగి వారిలో ప్రేమ, స్నేహం అనే సమాన భావాలను పెంపొందించేందుకు తోడ్పడాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100, 112 గురించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆయా నంబర్లు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని తెలిపారు. మహిళల కోసం 181 హెల్ప్‌లైన్, పిల్లల కోసం 1098 హెల్ప్‌లైన్ నంబరుపై బాలికలందరికీ అవగాహన కల్పించడం ద్వారా ఆపదలో ఉన్న వారు తక్షణ సహాయం పొందవచ్చని చెప్పారు. చైల్డ్‌లైన్ సే దోస్తు వారోత్సవాలు కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ఎం.సింహాచలం, కొలాబ్ కోఆర్డినేటర్ పి.హేమలత, ఎహెచ్‌టియు ఎస్ఐ కేశవరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి రాధిక

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి-శ్రీకాకుళంఅర్బన్, జలుమూరు, టెక్కలి రూరల్

కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే క్యూలైన్లలో యాత్రికులు దర్శనాలకు బారులు తీరారు. కొందరు నాగావళి నదిలో స్నానాలు చేసి శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ, ఆరవెల్లి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యాన స్వామివారికి తొలి సేవ అనంతరం వేకువజామును మూడు గంటల నుంచి సందర్శకులను ఆలయంలోకి అనుమతించారు. టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఒడిశా నుంచీ తరలివచ్చారు. ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తదితరులు దర్శించుకున్నారు. టిక్కెట్ల విక్రయ కౌంటర్లు, దర్శన క్యూలైన్లలో స్వల్ప తోపులాటలు చోటుచేసుకున్నాయి. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ఉచిత ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అష్టలక్ష్మి లేడీస్ కార్నర్ ప్రతినిధులు ఇందిరాగాంధీ కూడలి వద్ద, జనసేన పార్టీ కార్యకర్తలు అంబేద్కర్ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర రమణి సిల్క్ ప్రసాద్ అన్న ప్రసాద వితరణ చేపట్టారు.



ఎండల మల్లిఖార్జున ఆలయానికి పోటెత్తిన యాత్రికులు



ముఖలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న కృష్ణదాస్ దంపతులు

ఎండలోనే యాత్రికులు

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించేందుకు వచ్చిన యాత్రికులు ఎండలోనే క్యూలైన్లలో నిల్చొని అవస్థలు పడ్డారు. జిల్లా నలుమూలల నుంచి కాక ఒడిశా నుంచి వేకువజాము నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చారు. ఆలయానికి అర కిలోమీటరు దూరం వరకు ఎండలోనే యాత్రికులు క్యూలైన్లలో నిల్చొన్నారు. ప్రతి ఏడాదీ కార్తీక సోమవారాల్లో అధిక సంఖ్యలో యాత్రికులు వస్తున్నా వారికి దేవాదాయ శాఖ అధికారులు కనీస మౌలిక వసతులైన నీడ, నీరు సౌకర్యం కల్పించలేకపోతున్నారు.

శ్రీముఖలింగేశ్వర స్వామిని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ దర్శించుకున్నారు. అనంతరం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ స్థానికుల కోరిక మేరకు శ్రీముఖలింగం గ్రామానికి రెండువైపులా ముఖద్వారాల నిర్మాణంతో పాటు గ్రామంలో ఇంటింటికి తాగునీరు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.54 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

భూములు ఇచ్చే ప్రసక్తే లేదు

సబ్ కలెక్టర్‌కు తేల్చిచెప్పిన రైతులు

ప్రజాశక్తి - నౌపడ

భావనపాడు పోర్టు నిర్వాసితుల కోసం ప్రభుత్వం అడుగుతున్న వ్యవసాయ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని నౌపడ రైతులు తెగేసి చెప్పారు. భావనపాడు పోర్టు నిర్వాసితులకు అవసరమైన పునరావాసం కోసం సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి రైతులతో నౌపడ సచివాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భావనపాడు పోర్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. నిర్వాసితుల కోసం 55 ఎకరాలు అవసరమని, భూములు ఇచ్చి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. దీనిపై సానుకూలంగా మీ డిమాండ్లు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరగా రైతులు ముక్తకంఠంతో తిరస్కరించారు. భూములే ఇవ్వకూడదనుకుంటే డిమాండ్లు ఏముంటాయని ప్రశ్నించారు. నౌపడ గ్రామంలో ఎక్కువగా ఉప్పు భూములు ఉన్నాయని, వాటి లీజులు పునరుద్ధరణ కాక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. మరోవైపు ఉన్న కాస్త భూములూ పునరావాసం పేరుతో తీసుకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ ప్రాంతం పునరావాసానికి అనుకూలంగా ఉండదని, సాగునీటి సమస్య ఉందని, మరోచోట ప్రతిపాదన చేయాలని సర్పంచ్ ప్రతినిధి రవికుమార్ రెడ్డి సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం రైతులు ఒక్కొక్కరిగా మాట్లాడుతూ తామంతా 20, 30 సెంట్లు ఉన్న రైతులమని, ఉన్న కొద్దిపాటి భూములు తీసుకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన సుగ్గు స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ 84 మంది రైతుల్లో ఏ ఒక్క రైతుకూ వేరే చోట భూముల్లేవని తెలిపారు. పునరావాసం, రోడ్డు మార్గమని చెప్పి భూములు తీసుకుంటే సెంటు భూమి కూడా మిగలదని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కాకరాపల్లి పవర్‌ప్లాంట్ వలే పోర్టు నిర్మాణం కూడా ఆగిపోతే పునరావాసానికి భూములు ఇచ్చిన రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడాలా అని ప్రశ్నించారు. ఈలోగా ఆ భూములు బ్లాక్ అవుతాయని, వ్యవసాయం చేయలేమని, కనీస అవసరాలకు అమ్మకం, కొనుగోలు చేయలేక, బ్యాంకు లోన్లు రాక ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైతే భూములు ఇచ్చేందుకు సిద్ధమే కానీ, తమ భూములు కోల్పోయి వేరే వాళ్లకు ఇస్తామంటే ఒప్పుకునేది లేదని రైతు భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశాడు. ఎవరికీ ఇబ్బంది లేని చోట ప్రభుత్వ భూముల్లో పునరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తమను బాధ పెట్టొద్దని విన్నవించారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ మీ అభిప్రాయాలు తెలుసుకునేందుకు వచ్చానని, వచ్చిన అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పి సమావేశం ముగించారు. సమావేశంలో తహశీల్దార్ చలమయ్య, విఆర్‌ఒ ప్రసాద్, ఎంపిటిసి ప్రతినిధి లోపింటి రాములు, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అభిప్రాయాలను చెప్తున్న నౌపడ రైతులు

వంశధార నీరు శివారు భూములకు ఇవ్వాలి

ప్రజాశక్తి - పలాస

వంశధారలో నీరున్నా శివారు భూములకు కాలువల ద్వారా నీరు రావడం లేదని, సమయానికి నీటి తీరువా మాత్రం వసూలు చేస్తున్నా, నీరు అందించడం లేదని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు బొడ్డు వాసుదేవరావు అన్నారు. కాశీబుగ్గ వంశధార డిఇ కార్యాలయంలో సూపరిండెంట్ పి.శ్రీనివాసరావుకు శివారు భూములకు నీరు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశధారలో సగటున 18000 క్యూసెక్కుల నీరు వథాగా సముద్రం పాలవుతున్న, 2400 క్యూసెక్కుల నీరు రైతులకు అందించే స్థితిలో పాలకులు లేరని విమర్శించారు. రైతు ప్రభుత్వమని ఆర్భాట ప్రచారం తప్ప రైతులపై చిత్తశుద్ధి లేదన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం సృష్టిస్తున్న కృత్రిమ కరువు వల్ల రైతులు అప్పుల పాలై, వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో పంట పోతే ఆ రైతు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. శివారు భూముల రైతులందరికీ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల చంద్రయ్య, దుబ్బ భాస్కరరావు, వంకల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

వ్యాక్సినేషన్‌పై మరింత శ్రద్ధ

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా అందించాలని, దీనిపై క్షేత్రస్థాయిలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పోలియో, హెపటైటిస్ బి, రూటా, మీజిల్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శతశాతం వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలుపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎం, ఆశావర్కర్లు చేయాల్సిన పనులపై అవగాహన ఉండాలని తెలిపారు. 104 వాహనం ద్వారా గ్రామాల్లో 14 రకాల వైద్య పరీక్షలు, కోవిడ్ టెస్టు, టెలీ మెడిసిన్, 67 రకాల మందులు అందించేందుకు వీలుందన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, డయేరియా వ్యాధులపై ప్రతి గ్రామంలో ఆశావర్కరు, ఎఎన్ఎం ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి వెంటనే వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈనెల 12 నుంచి డిసెంబరు ఆరో తేదీ వరకు ఇంటింటికీ ఆశావర్కర్, అంగన్వాడీ కార్యకర్త, ఎఎన్ఎం బృందంగా వెళ్లి స్పర్శ లేని మచ్చలను గుర్తించాలన్నారు. టిబి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి సకాలంలో గుర్తించి టెస్టు చేయించి ట్రీట్‌మెంట్ ఇప్పించాలన్నారు. ఎఎన్ఎం తమ పరిధిలో నమోదైన ఎఎన్‌సి ఐడిలను అంగన్వాడీ సెంటర్లలో పోషణ యాప్‌లో నమోదు చేయాలన్నారు. 12 వారాల్లోపు గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి ఐడిలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ఉప వైద్యాధికారి లక్ష్మీతులసి, పిఒడిటిటి కృష్ణమోహన్, ప్రకాశరావు, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాకుంటే ఎలా?

- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్
- 'స్పందన'కు 246 వినతులు


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వంశధార ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులు ఏడాదిన్నర కాలంగా తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వారం వారం స్పందనలో ఫిర్యాదు చేస్తున్నారని, వాటిని పరిష్కరించక పోగా పరిష్కారమైనట్లు అధికార యంత్రాంగం రికార్డుల్లో చూపడం ఎంతవరకు సమంజసమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. సోమవారం జెడ్‌పిలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి నవీన్‌లు హాజరై వినతులు స్వీకరించారు. వంశధార నిర్వాసితులతో పాటు ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలతో కలసి కూన రవికుమార్ స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయడం లేదని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల పేరుతో కరెంటు మీటర్లు ఎక్కువగా ఉన్నట్లు చూపిస్తున్నారని, కరెంటు మీటర్లు లేవని విద్యుత్ శాఖ అధికారులు నిరభ్యంతర ధ్రువపత్రం ఇచ్చినా వాటిని తొలగించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశ పూర్వకంగా పేదలైన లబ్ధిదారులపై కక్ష సాధింపు కొనసాగుతోందన్నారు. సరుబుజ్జిలి మండలం పెద్ద సవళాపురం గ్రామంలో హైస్కూల్ ఏర్పాటుకు గతంలో దాతలు ఇచ్చిన నాలుగు ఎకరాల స్థలంలో అడ్డంగా గోడ కట్టి సగరం భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఒక్క ఆమదాలవలస నియోజకవర్గం నుంచి సోమవారం 42 వినతులను ఆయన అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ నరసన్నపేట పట్టణంలో రూ.కోట్ల విలువైన ఇందిరా నగర్ పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేసి భవంతులు నిర్మించుకునేందుకు కుట్ర చేస్తున్నారని, గతంలో దీనిపై ఫిర్యాదు ఇచ్చినా ఈ పార్కును కాపాడాల్సిన అధికారులు ఇప్పుడు సుడా నుంచి అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, అందు వల్ల ప్రజలకు ఉపయోగకరమైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. సుడి దోమ వల్ల వరి పంట పెద్దఎత్తున నష్ట పోతోందని, రైతులను ఆదుకునేందుకు వీలుగా రబీలో ఉచిత విత్తనాలు సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు. చేనేత పెన్షన్లు తొలగింపులో అక్రమాలు చోటు చేసు కుంటున్నాయని, ఉద్దేశ పూర్వకంగా అర్హులైన నేతన్నలకు పెన్షన్ ఇవ్వాలని కలెక్టరు కోరారు.

నగరంలోని కోటేశ్వర వీధిలో ఉన్న మున్సిపల్ స్కూల్ శిథిలావస్థకు చేరుకుందని, పాఠశాలకు మరమ్మతులు చేయమంటే పిల్లలను ఏనుగు మహల్ వీధి స్కూల్‌కు తరలించారని, ఆ పాఠశాల కోటేశ్వరవీధికి దూరంగా ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరుకు వివరించారు.

జిల్లా వ్యాప్తంగా 246 వినతులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. పెండింగ్ వినతులు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎపి సేవా సర్వీసెస్ పోర్టల్ లో రెవెన్యూ, మున్సిపల్, తదితర శాఖలకు వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వినతుల పరిష్కారంలో అధికారులే స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్ జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నేర్చుకునేతత్వం అలవరుచుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: ప్రతి నిత్యం మనకు తెలియని ఎన్నో విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి ప్రతిఒక్కరిలో పెరగాలని, ఎల్లప్పుడు నేర్చుకునే తత్వం అలవరుచుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. బాలల కోసం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం శుభ పరిణామన్నారు. చదువుకోవడం అలవాటుగా మార్చుకోవాలని, అప్పుడే మంచి వ్యక్తిత్వం అలవరుచుకోవచ్చన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలే కాకుండా అన్నిరకాల పుస్తకాలను చదువుకోవడం ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. సివిల్ సర్వీసెస్‌లో ఎంపికలో తమ అనుభవాలను ఆయన వివరించారు. చదువుతో పాటు క్రీడలు, తదితరమైనవి ఉండాలని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సువ్వారి సువర్ణ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అందరికీ అందుబాటులో అన్ని పుస్తకాలు ఉంటాయన్నారు. నేటి తరానికి గ్రంథాలయ విశిష్టతను తెలిపేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ప్రజా కవి, స్వాతంత్ర్య సమరయోధుడు కీర్తిశేషులు గరిమెళ్ల సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. లైబ్రరీ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, చిట్టి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఆసియా కప్ సాఫ్ట్‌బాల్ పోటీలకు వరలక్ష్మి ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


వరలక్ష్మి

ఇంటర్నేషనల్ ఆసియా కప్ ఆసియన్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ ఉమెన్స్ ఛాంపియన్ షిప్-22 పోటీల్లో సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన బూలికప్పల వరలక్ష్మి ఎంపికయ్యారు. థాయిలాండ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బ్యాంకాక్‌లో డిసెంబరు 17 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఛాంపియన్ షిప్ పోటీలకు ఆమె ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిఇఓ ఎ.వెంకటేష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరలక్ష్మి ఎంపికపై జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహరాజు, సెక్రటరీ శిగిలపల్లి లక్ష్మీదేవిలు హర్షం వ్యక్తం చేశారు. వరలక్ష్మి ఆమదాలవలస మండలం కొత్తవలస వాసి. చిన్నప్పటి నుంచి క్రీడల్లో రాణించాలన్న తపనతోనే సాఫ్ట్‌బాల్ క్రీడను ఎంచుకున్నట్లు ఆమె తెలిపారు. అసోసియేషన్ చైర్మన్ బడగల హరిధరరావు, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, సెక్రటరి ఎం.ఓ.రమణ వైస్ ప్రెసిడెంట్ మెట్ట తిరుపతిరావు, ఫైన నవీన్, బొడ్డేపల్లి సురేష్, జాయింట్ సెక్రటరీ ఎం.ఆనందకిరణ్, ఎ.డిల్లీశ్వరరావు, ఎ.రాజగోపాల్, జి.రాజశేఖర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సెక్రటరీ ఎం.సాంబమూర్తి అభినందనలు తెలియజేశారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎన్.కాసులబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రాజశేఖర్ సోమవారం తెలిపారు. స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీలో విశేష ప్రతిభను కనబర్చి అండర్-17 విభాగంలో జి.ప్రియాంక, పి.మాధురి, ఎస్.అశ్విని, ఎస్.గాయత్రి, అండర్-14 విభాగంలో జి.లాస్య జి.అఖిల, జి.సుస్మిత, వి.దివ్య, ఎండ వెంకటరమణ, నర్సునాయుడు, స్టాండ్‌బైగా జి.లక్ష్మి, పి.దీపికలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

క్రీడాకారిణికి అభినందనలు

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని ఓ.వి.పేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిని సిహెచ్.నిర్మల ఎంపికైందని ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం బాలికల దినోత్సవం సందర్భంగా ఆమెను అభినందిస్తూ... ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి అండర్-17 క్రీడ పోటీలో బాలికల విభాగంలో నిర్మల రాష్ట్రస్థాయిలో ఎంపికైందని తెలిపారు.

సుధాకర్‌కు బంగారు పతకం


పతకం అందుకున్న నలినీ సుధాకర్

లావేరు : లావేరు జెడ్‌పి పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు సంజీవిని నళిని సుధాకర్ విశాఖపట్నంలో నిర్వహించిన 42వ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు సి.కె.నాయుడు స్టేడియంలో నిర్వహించి ఐదు కిలోమీటర్ల నడకపోటీల్లో బంగారు పథకాన్ని సాధించారు. అలాగే 1500 మీటర్ల, 400 మీటర్లు పరుగు పోటీల్లో కాస్యం పతకాలను సాధించారు. 15 రోజులు వ్యవధిలో ఏడు పతకాలను సాధించిన సుధాకర్‌కు ఎంఇఒ లండ ఈశ్వరరావుకు అభినందించారు. ఈ పతకాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ ఇందుకురి రాఘురాజు, అథ్లెటిక్స్ మాస్టార్ రాష్ట్ర అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్‌లు పతకాలను, ప్రసంశాపత్రాలను అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లోనూ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని, గ్రంథాలయాల విశిష్టతను, ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో రోజుకో కార్యక్రమం చేపట్టనున్నారు.

జలుమూరు: గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వివిధ పోటీ పరీక్షలకు హాజరవుతున్న యువకులు గ్రంథాలయాల్లో ఉండే పుస్తకాలను చదువుకుని ఉద్యోగాలు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, గ్రంథాలయ అధికారి ఢిల్లీశ్వరి, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పార్వతి, సిఆర్‌పి వైకుంఠరావు, నాయకులు కె.దామోదరరావు, బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కవిటి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. త్వరలోనే కవిటిలో రెండు డిజిటల్ గ్రంథాలయాలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సిహెచ్ బెహరా, దుద్ది ధర్మారావు, బెందాళం రమణ, పి.జయరాం, ఉపాధ్యాయులు మహేష్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పలాస: పిల్లలతో ఆట, పాటలతో పాటు, న్యూస్ రీడింగ్, పుస్తకాలు చదవాలని కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ కోరారు. కాశీబుగ్గ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, రాంబాబు, పి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖా గ్రంథాలయంలోగ్రంథాలయ వారోత్సవాలను ఎంపిపి ఎం.రామారావు ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు అనురాధ, సర్పంచ్ ప్రతినిధి ఆర్.వాసు, ఎంపిటిసి ప్రతినిధి జై.మునిరావు , తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండల కేంద్రంలో 55వ గ్రంథాలయ వారోత్సవాలను ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్. ప్రతినిధి జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, జిభారతి, తదితరులు పాల్గొన్నారు

పోలాకి: గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలని సర్పంచ్ మజ్జి రమణమ్మ కోరారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో తూలుగు అశోక్ కుమార్, గ్రంథాలయ అధికారిణి కె.మానస, ఉుకలాపు రాంబాబు, యందవ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నౌపడ: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపవతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాములు, వి.రవి, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: శాశ్వత గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేస్తామని ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావులు అన్నారు. పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవంలో వారు పాల్గొని, జాయతీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులకు స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలోకమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఇర్రి చిరంజీవి, పండా గోవిందరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. నగరంలోని హడ్కో కాలనీ బలగ శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్, మాజా కౌన్సిలర్ ఆబోతుల రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని బొడ్డేపల్లిపేటలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రణస్థలం : రణస్థలం శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవంలో తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, సర్పంచ్ బి.రమణ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని లోలుగులో నిర్వహించిన గ్రంథాలయంలో జెడ్‌పిటిసి కాంతారావు ప్రారంభించారు. ముందుగా నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి లక్షుంనాయుడు, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ వీరాస్వామి, లైబ్రేరియన్ కళ్యాణి, వైసిపి నాయకులు లోలుగు రామినాయుడు, ఉపాధ్యాయులు పార్వతీశం, లోపింటి అప్పారావు పాల్గొన్నారు.

పొందూరు శాఖాగ్రంథాలయంలో సర్పంచ్ రేగడి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామమనోహర్, గ్రంథాలయ అధికారి పి.వి.భాస్కర్‌రాజా పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరు శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాన్ని సర్పంచ్ పడల కృష్ణవేణి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.ఇందిరా, ఎంఇఒ బి.శ్రీధర్, విశ్రాంత ఎంఇఒ బి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు వి.నపసాదరావు పాల్గొన్నారు.

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఎంఇఒ లండ ఈశ్వరరావు గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమములో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు ఎ.గడ్డియ్య విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ తేనెల విద్యాసాగర్ ప్రారంభించి నెహ్రూ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు.


కవిటి : మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు


నందిగాం : నివాళ్లర్పిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి


పోలాకి : జ్యోతిప్రజ్వలన చేస్తున్న సర్పంచ్ రమణమ్మ


జలుమూరు: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్


పలాస : మాట్లాడుతున్న దువ్వాడ శ్రీకాంత్


కోటబొమ్మాళి : మాట్లాడుతున్న సర్పంచ్ సంజీవరావు


ఆమదాలవలస : మాట్లాడుతున్న రమేష్ కుమార్


నౌపడ: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవికుమార్ రెడ్డి

'స్పందన' ఫిర్యాదులు పెండింగ్ వద్దు

ఎస్‌పి జి.ఆర్ రాధిక


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్ట ప్రకారం పరిష్కారం చూపాలని, ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఎస్‌పి, అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు నిర్వహించిన 'స్పందన'లో 27 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారులు తమ తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి ఓపికతో వారి సమస్యలును అడిగి తెలుసుకున్నారు. కుటుంబ తగదాలకు సంబంధించినవి మూడు, ఆస్తి తగాదాలు పది, సివిల్ అంశంపై రెండు, పాత ఫిర్యాదులు ఆరు, ఇతర అంశాలపై ఆరు, చిటింగ్ అంశంపై ఆరు ఫిర్యాదు వచ్చాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను ఫోన్ కాల్ ద్వారా తెలియపరిచి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు అండ

మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్‌పి జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ... ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్.మల్లేశ్వరరావు సతీమణి లలితకుమారికి ఎస్‌పి కార్యాలయంలో చెక్కులను సోమవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైనా విడో, ఫ్లాగ్ ఫండ్, రూ.50 వేలు నగదు, చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఎం.శివరామరాజు, సూపరింటెండెంట్ లిల్లీబాయ్ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- జలుమూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కృష్ణదాస్ అన్నారు. మండలంలోని చెన్నాయివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి పోస్టర్లను అందజేశారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల కన్వీనర్ మొజ్జాడ శ్యామలరావు, సర్పంచ్ ప్రసాదరావు, ఎంపిటిసి ఆర్.చందనబాబు, అల్లాడ పిఎసిఎస్ చైర్మన్ పొన్నాన ముసలినాయుడు పాల్గొన్నారు.


పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

క్రైమ్ కార్నర్


ఎండయ్యరెడ్డి మృతదేహం

చెరువులో పడి వృద్ధుడు మృతి

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన పిన్నింటి ఎండయ్యరెడ్డి(64) చెరువులో పడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఎండయ్య ఈ నెల 11వ తేదీన కాలకత్యాలు తీర్చుకునేందుకు నౌపడలో చర్చి వెనుక ఉన్న చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు పడిపోవడంతో చనిపోయాడు. ఎండయ్యరెడ్డి ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు మూడు రోజులుగా వెతుకుతున్నారు. సోమవారం ఉదయం చెరువుకు వెళ్లిన స్థానికులు నీటిలో మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని కోడలు కనకమ్మ ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ మెట్ట చంద్రరావు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ పట్టణం ఒడిశా రోడ్డులో గొరిబంద పంచాయతీ రాజపురం వద్ద గుర్తు తెలియని వాహనం సోమవారం ఢీకొని తరాసి గణపతి (45) మృతి చెందాడు. వ్యక్తిగత పనులు ముగించుకొని కాశీనగర్ నుంచి సైకిల్‌పై వస్తుండగా... మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడడంతో పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులు గుర్తించి కాశీనగర్ సమూహ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. కాశీనగర్ ఐఐసి సుశాంత్ సాహు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లోళ్ల రాజేష్

కాలువ నిర్మించరూ...

కవిటి: మండలం కేంద్రంలో ఇటీవల సిసి రోడ్లు నిర్మించి, కాలువల నిర్మించలేదని, ప్రజలు అవస్థలు పడుతున్నారని జనసేన నాయకులు లోళ్ల రాజేష్ అన్నారు. స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ వీరభద్రస్వామికి సోమవారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జన సైనికులు ప్రశాంత్, కృష్ణ, జానీ, కాళీ, దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

ఇచ్ఛాపురం: టిడిపి బిసి సాధికారత రాష్ట్ర కమిటీ కన్వీనరు కొండ శంకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బస్ స్టాండ్, మ్యాక్సీ స్టాండ్ వద్ద నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మ్యాక్స్ ఆటో వాహన యూనియన్ అధ్వర్యంలో కొండ శంకర్‌రెడ్డి జన్మదినం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరెడ్డి పేదలకు దుస్తులు పంపిణి చేశారు.. కార్యక్రమంలో మ్యాక్సీ ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.


దుస్తులను పంపిణీ చేస్తున్న శంకర్ రెడ్డి

'కాకినాడ ఆదిత్య' విద్యార్థినికి రూ.ఆరు లక్షల వార్షిక వేతనం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఎంఇసిఎస్ రెండో సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థిని జామి ప్రియాంకకు ప్రముఖ కంపెనీ అట్లాంటా ఐటి సొల్యూషన్స్‌లో ఆరు లక్షల వార్షిక వేతనంతో కొలువు వచ్చినట్టు కలశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ కంపెనీ నిర్వహించిన ఐదు రౌండ్లలో విజయం సాధించి కొలువును సాధించిందని అన్నారు. మొదటి నుంచీ ఇస్తున్న క్రమ శిక్షణతో కూడిన క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ మూల కారణమని అన్నారు. ఐటి కొలువులు సాధించడం కష్టం అన్న విషయాన్ని కాకినాడ ఆదిత్య విద్య సంస్థలు సుసాధ్యం చేసిందన్నారు. ప్రియాంకను ఆదిత్య విద్య సంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు అభినందించారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం


ఎన్నికైన నూతన కార్యవర్గం

హేమలతకు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజినీరింగ్ నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షులు కె.హేమలత ఎన్నికయ్యారు. నగరంలోని ఇఇ కార్యాలయంలో ఈ ఎన్నిక సోమవారం నిర్వహించారు. కార్యదర్శిగా ఆర్.మురళీకృష్ణ, కోశాధికారిగా కె.పాపారావులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.నరసింగరావు, సహాయక ఎన్నికల అధికారిగా ఎం.వాసుదేవరావు, ఎన్నికల అబ్జర్వర్‌గా జి.దుర్గామహాలక్ష్మి వ్యవహరించారు.


రాపాకలో అన్నదానం

పొందూరు: మండలంలోని రాపాకలో కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున నుంచే ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


పొందూరు : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

పులిహోరా వితరణ

ఆమదాలవలస : కార్తీకంలోని మూడో సోమవారం కావడంతో పట్టణంలోని శివాలయానికి వచ్చే యాత్రికులకు మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామ్ పోలిహోర సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక సోమవారం యాత్రికులకు పులిహోరా పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. సుమారు వెయ్యి మంది యాత్రికులకు పులిహోరాన్ని పంపిణీ చేశానని తెలిపారు. కార్యక్రమంలో గుడ్ల బాబు, మెట్ట నాగు, వెంకటబాల తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : పులిహోరను పంపిణీ చేస్తున్న శ్యామ్

వి.ఆర్ గూడెంలో వైద్య శిబిరం

పొందూరు: మండలంలోని వి.ఆర్.గూడెంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, సుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ సమస్యలు, ఎముకులు, కీళ్లనొప్పులతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యులు మేఘనవేణి, ఉపసర్పంచ్ ప్రతినిధి సువ్వారి గోవిందరావు, అసిస్టెంట్ మేనేజర్ ఎం.సింహాచలం, ఎన్.రాజు, కె.కాళిదాసు, జి.దాలినాయుడు, వార్డు సభ్యులు పోతన్న, పోలయ్య, దాలప్పడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మధుమేహాన్ని తరిమికొడదాం


ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్, లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జీవనశైలిలో మార్పులు, జన్యుపరమైన అంశాలు కారణంగా మధుమేహం విస్తరిస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని స్టార్ వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్ సెంట్రల్ సంయుక్తంగా జెమ్స్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అధ్యక్షతన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చొవర తీసుకొంటే పెద్దఎత్తున ఈ ప్రమాదం నుంచి కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. జెమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ వైద్యాధికారి కె.సుధీర్ మాట్లాడుతూ కోవిడ్ అనంతరం మధుమేహం పెరుగుతుందని, దీని నియంత్రణకు అందరూ నడుమ కట్టి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు హరికాప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పి.జి.గుప్తా, మాజీ వాకర్స్ గవర్నర్లు, జెమ్స్ మేనేజర్ ఆబోతుల రామ్మోహనరావు పాల్గొన్నారు. ముందుగా కళాశాల నుంచి అంబేద్కర్ కూడలి వరకూ అవగాహనా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

సుడిదోమపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వరిని సుడి దోమ ఆశిస్తే రైతులు అప్రమత్తంగా ఉండి, నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఉప సంచాలకులు త్రినాథస్వామి అన్నారు. మండలంలో సోమవారం వ్యవసాయ అధికార బృందం పర్యటించింది. అందులో భాగంగా తేలుకుంచి గ్రామంలో వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో సుడి దోమ అదుపులో ఉందని, ఎటువంటి లక్షణాలు ఉంటే నివారణ చర్యలు తీసుకోవాలి అన్నారు. ఆయనతోపాటు ఎడి జగన్మోహనరావు, ఎడిఇ వెంకటరావు, ఎఒ శ్రీదేవి, శాస్త్రవేత్త చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని కొల్లూరు ఆర్‌బికె పరిధిలోని కర్తలి గ్రామంలోని వరి పంట పొలాలను సోమవారం కెవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించారు. శాస్త్రవేత్తలు చిట్టిబాబు, త్రినాధ్‌స్వామి మాట్లాడుతూ సుడిదోమ నివారణకు సూచించిన మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సిహెచ్ వెంకటరావు, కె.జగన్మోహనరావు, ఎఒ ధనంజయం, సిబ్బంది, రైతులు, సర్పంచ్ ప్రతినిధి పైల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పలాస: దోమ ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో నత్రజని అధికంగా వాడకూడదని కెవికె శాస్త్రవేత్త చిట్టిబాబు రైతులకు సూచించారు. బ్రాహ్మణతర్ల గ్రామంలో వ్యవసాయశాఖ అధికారుల బృందం సోమవారం పంట పొలాలను పరిశీలించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో నీరు అధికంగా నిల్వ ఉండకుండా అడపాదడపా పొలాన్ని ఆరబెట్టాలన్నారు. ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటలు, 20 సెంటీమీటర్లు దూరం తీసుకోవాలని సూచించారు. దీనివల్ల వరి చేనుకు సూర్యరశ్మి, గాలి వెలుతురు ప్రవేశించి దోమ ఉధృతి తగ్గుతుందన్నారు. దీని నివారణకు ఎకరాకు బ్రుప్రోపెజిన్ 350 ఎంఎల్ డైనాటో ప్యూరాన్ 100 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ త్రినాథ్‌స్వామి, ఎడిఎలు వెంకటరావు, ఎల్‌వి మధుసూదనరావు, ఎఒ పోలారావు, ఎఇఒలు పాపారావు, స్వాతి, ప్రశాంత్, దంతం వైకుంఠరావు, బి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మెళియాపుట్టి: సుడిదోమ ఆశించిన పొలాలను జిల్లా రీసెర్చ్ సెంటర్ డిడిఎ త్రినాథస్వామి, కెవికె శాస్త్రవేత్త చిట్టిబాబు, వ్యవసాయశాఖ సంచాలకులు మధుబాబు పరిశీలించారు. దోమ పోటు నివారణకు చర్యలను వివరించారు. రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు రసాయనిక పురుగు మందులను, తెగుళ్ల మందులను, సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు శరత్‌కుమార్‌రెడ్డి, యమున, వాసు, గోకర్ణపురం సర్పంచ్ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎపిఎం కూర్మారావు

సమిష్టి కృషితో 'నాడు-నేడు'లో ప్రగతి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమిష్టి కృషితో నాడు-నేడు పనుల్లో ప్రగతి సాధిద్దామని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ దుప్పల రామారావు అధ్యక్షతన ఎంఆర్‌సి సిబ్బందితో మనబడి నాడు-నేడుపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విప్లవాత్మక విద్యా సంస్కరణలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నూతన శకానికి నాంది పలికిందన్నారు. సెర్ప్, డిఆర్‌డి సహకారంతో సమిష్టిగా కృషి చేసి నాడు-నేడు ప్రగతి కనపరుద్దామని అన్నారు. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి వంటి పథకాలు, పాఠ్యప్రణాళిక సంస్కరణలు, ఇంగ్లీష్ మీడియం బోధన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పాఠశాల విద్యను ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్స్ నర్సింగరావు, శ్రీను, ప్రశాంత్ కుమార్, శైలజ, జ్యోతి, చంద్రకళ, ధనలక్ష్మి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.



పొందూరు : జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు రమణమూర్తి

రైతు శ్రేయస్సే ధ్యేయం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యాన సోమవారం సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యాలయంలో జిల్లా సహకార అధికారి శీలం సుబ్బారావు జాతీయ పతాకాన్ని ఎగుర వేసి ఈ వారోత్సవాలను ప్రారంభించారు. అలాగే డిసిసిబి కార్యాలయంలో చైర్మన్ కరిమి రాజేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎల్‌సిఒ కె.దామోదరరావు, డిసిఎఒ రణేష్, సహకార విద్యాధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు.

పొందూరు: సహకార వ్యవస్థ ద్వారా అందజేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి అన్నారు. పొందూరు పిఎసిఎస్‌లో 69వ సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. సిబ్బంది సరళతరంగా రుణాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సభ్యులు గూనాన కృష్ణ, బొమ్మాళి శేషగిరి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.జానకీరాం, బ్రాంచ్ మేనేజర్ మొయ్యి ప్రసన్న, సిఇఒ ఎర్నేన పాపినాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : రైతు శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయమని పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కృష్ణాపురం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార సంఘం సిఇఒ గంగు రమణ, డైరెక్టర్లు నక్క కన్నబాబు, తిర్లంగి రామారావు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సనపల అన్నాజీరావు, దేశేళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, పైడి నాగభూషణరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, మంత్రి నరసింహమూర్తి, బుజ్జిబాబు పాల్గొన్నారు.



ఆమదాలవలస : బాలలను అభినందిస్తున్న వెంకటేశ్వరరావు

పిల్లల్లోని సృనాత్మకతను గుర్తించి ఉపాధ్యాయులు, తల్లితండ్రులు తగిన విధంగా ప్రోత్సహించాలని జిల్లా మహిళా, శిశు సంరక్షణ సాధికార అధికారి కె.అనంతలక్ష్మి అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు. వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిఇఒ అధికారి పగడలమ్మ, ప్రధానోపాధ్యయులు ఎం.వాగ్దేది, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలోనిగాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో నెహ్రూ విగ్రహానికి ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పందిరి అప్పారావు, ఎం.ఎ.ఎన్.భట్లు, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, మహిబుల్లా ఖాన్, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నగరంలోని నందమూరి తారక రామారావు మున్సిపల్ కార్పొరేషన్ ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్ నెహ్రూ జీవిత ఆశయాలు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన 60 మంది బాలబాలికలకు పాఠశాల దాతలు ఇచ్చిన విరాళాలతో వచ్చిన వడ్డీతో బహుమతులను కొనుగోలు అందజేశారు.

నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమయ పాలన, పరిశుభ్రత, సర్దుకుపోవడం తదితర అంశాల్లో విజేతలుగా నిలిచిన పదో తరగతి విద్యార్థులు ఎస్.చాందినీ, డి.ప్రీతి, టి.తేజ, ఇ.శ్రుతి, కె.భవ్యలను ఉత్తమ విద్యార్థులకు అదనపు ఎస్‌పి టి.వి.విఠలేశ్వర్ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అన్నెపు రమేష్‌బాబు, అన్నెపు లావణ్య రాణి, ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

రణస్థలం: యూత్ క్లబ్ బెజ్జిపురం మండల ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ అడప రమణమూర్తి రణస్థలం మండలంలోని 14 హైస్కూలు, కాలేజీలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆమదాలవలస : పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ లక్ష్మీనగర్‌లో బాలల దినోత్సవం సందర్భంగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్-22కు గాను ఐదు మంది విద్యార్థులకు బ్రాంచ్ మేనేజర్ మెమొంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు పి.వి. రమణమ్మ పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పెద్దపేటలోని ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది శంకరరావు పాల్గొన్నారు.

లావేరు: మండలంలో బుడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహించిన బాలల దినోత్సవంలో ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు, ఎస్.కె.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అలాగే మురపాకలో రవితేజ స్కూల్ డైరెక్టర్ చిన్నారావు అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వేణుగోపాలరావు, యాజమాన్యం చిన్నారావు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

పొందూరు : మండలంలోని లోలుగు కెజిబివిలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని అనూషను అభినందించి జ్ఞాపికను అందజేశారు. అలాగే తాడివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

అలాగే పొందూరులోని శ్రీవేద స్కూల్‌లో డైరెక్టర్ బి.బాబూరావు అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.సునీత, ప్రిన్సిపాల్ నల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని స్వర్ణ భారతి విద్యా సంస్థల్లో నెహ్రూ చిత్రపటానికి ఆ సంస్థ చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి పూలమాలేసి, నివాళులర్పించారు. గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పూర్ణ చంద్ర బెహరా, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడి బి.పుష్ప బాలల దినోత్సవం నిర్వహించారు. జ్ఞానభారతి విద్యా సంస్థలో విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన మినీ బజారు స్టాల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిఐ సతీష్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ భారతీ దివ్య, ఎంఇఒ అప్పారావు, సయ్యద్‌సుల్తాన్, ప్రేమ్ సర్తాజ్ ఖాణ్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం మున్సిపల్ ఒడియా ప్రాథమిక పాఠశాల, బ్రాహ్మణ స్ట్రీట్‌లో సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి ఆధ్వర్యాన నిర్వహించిన మండలస్థాయి పోటీల విజేతలకు కె.అప్పారావు బహుమతులను అందజేశారు. ఈ పోటీలో 46 పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెఎసి అధ్యక్షులు ఉప్పాడ కామేష్, కార్యదర్శి కర్రి సోమేశ్వరరావు, గౌరవ సలహాదారులు ఎస్.మల్లేష్, కె.సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

కవిటి: కళ్యాణి ఆంగ్ల పాఠశాల, జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ ఎంపిపి పూడి నేతాజీ, జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ మాట్లాడుతూ భవిష్యత్ భారతం నేటి బాలలపైనే ఆధారపడి ఉందని అన్నారు. ఎస్‌విజె విద్యా సంస్థల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జగతి సర్పంచ్ పూడి ప్రసాదరావు, ఎస్‌విజె కరస్పాండెంట్ బి.కింగ్, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా హెచ్ఎం జానకిరామయ్య నెహ్రూ చైత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. పలు పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆది కేశవరెడ్డి, భాస్కరరావు, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని అక్కయ్యవలస ఎంపియుపి పాఠశాలలో హెచ్ఎం సంజీవరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్లాస్టిక్ భూతం అనే చైతన్య నాటిక ద్వారా ప్లాస్టిక్ వాడకం వద్దంటూ తెలియజేశారు. వారల్డ్ ఉమెన్ అనే నాటకం ద్వారా తెలుగుభాష గొప్పతనంపై నృత్యం, తేనెల తేటల మాటలతో అనే పాటకు నృత్యం అకట్టుకున్నాయి. బ్లూమింగ్ బ్రాడ్స్ పాఠశాలలో కరస్పాండెంట్ ఎస్.చందు, ప్రిన్సిపాల్ డి.దుర్గప్రసాద్ ఆద్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. దేశ నేతల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నాయి. వంశధార హైస్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా ప్రదర్శించిన విద్యార్థుల డ్యాన్సులు ఆలరించాయి. అక్కయ్యవలస ప్రాథమిక పాఠశాలలో బాల్యవివాహాలు వల్ల సంక్రమించే అనార్థాలపై వివరించారు.

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, బిఎస్‌జెఆర్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ కోత మురళీధర్, ప్రణవి డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ పేరాడ పరమేశ్వరరావు, విశ్వజ్యోతి జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ దుప్పల రవికుమార్, నర్సింగపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమేశ్వరరావు, చాకిపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసరావు నెహ్రూ చిత్రపటాలకు పూలమాలేసి, నివాళులర్పించారు. బూరగాం జెడ్‌పి పాఠశాలలో హెచ్ఎం చిన్నారావు, రవీంద్రభారతిలో ప్రిన్సిపాల్ పద్మజ నెహ్రూ చిత్రపటానికి పూలమాలేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సుజాత, రామారావు, ఆదినారాయణ, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని లఖిదాసుపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవం నిర్వహించారు. 9వతరగతి విద్యార్థి బోల్ల హేమంత్ నెహ్రు వేషధారణతో ఆలరించారు. చిత్రపటానికి హెచ్ఎం చిలుకు కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక రామారావు, ఇందిరాభాయి, బెందాళం రత్నం, రామారావు, తులసిప్రసాద్, త్రినాథరావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : స్వర్ణభారతిలో వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు



పొందూరు: శ్రీవేద పాఠశాలలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



శ్రీకాకుళం అర్బన్ : మెమొంటోలను అందజేస్తున్న హెచ్ఎం దేవదత్తానంద్



లావేరు : మాట్లాడుతున్న రవితేజ స్కూల్ చిన్నారి



కవిటి : నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నేతాజీ



కోటబొమ్మాళి : అక్కయ్యవలస పాఠశాలలో విద్యార్థులు వేసిన వేషధారణలు

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరమని ఎసిబి డిఎస్‌పి బి.వి.ఎస్.ఎస్.మూర్తి అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులను, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖలపై విద్యార్థులు పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకుని భవిష్యత్‌లో రాణించాలన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే అన్ని పోటీల్లో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందిన అన్నెపు జాహ్నవి, గురుగుబిల్లి మౌనిక, వావిలపల్లి కావ్యలను అభినందించారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పారుపల్లి శ్రీనివాసరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.వి.రమణ, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రాష్ట్ర డెమోక్రటిక్ పిఆర్‌టియు ఉపాధ్యక్షులు గురుగుబెల్లి దామోదరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస/సరుబుజ్జిలి

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యత సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్స్ వాటి వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సూరెన్స్ పథకాలను గురించి విపులంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మెట్ట సౌజన్య, పోతురాజు మహాలక్ష్మి, సిఎఫ్‌ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ప్రజా వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

కోటబొమ్మాళి: ప్రజా వైద్యశాలను సద్వినియోగించుకోవాలని అక్కయ్యవలస సర్పంచ్ సుంకరి జనార్థనరావు అన్నారు. సోమవారం అక్కయ్యవలస గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక వైద్యం కోసం ఎవరూ కోటబొమ్మాళి వెళ్లాల్సిన పనిలేదని, ఇక్కడ డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉంటారని ఇక్కడకు వచ్చి ఉచితంగా వైద్యం చేయించుకోవాలని కోరారు. అనంతరం వైద్యులు రోగులకు వైద్యం చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిఒ డి.హిమ, వైద్య సిబ్బంది నీలవేణి, సుశీల, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

కంచిలి: మండలంలోని కొక్కిలి పుట్టుగ, మండపల్లి సచివాలయాలను స్థానిక ఎంపిడిఒ చల్ల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి పైల దేవదాసురెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కొక్కిలి పుట్టుగ పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించబోయే గడప గడపకు మన ప్రభుత్వం విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మండపల్లిలో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వారితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌బికె పనులను పరిశీలిస్తున్న ఎంపిపి దేవదాస్ రెడ్డి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఆర్‌డిఒ సీతారామ్మూర్తి



పలాస : మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

ప్రజాశక్తి - పలాస

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు చేపడితే చర్యలు తప్పవని పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి హెచ్చరించారు. మండలంలోని శాసనం గ్రామంలో చైల్డ్ లైన్ సే దోస్తీలో భాగంగా గెస్ట్ చైల్డ్‌లైన్ పలాస సబ్ సెంటర్ టీం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం చైల్డ్ లైన్ సే దోస్తీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను విద్యార్థులకు వివరించారు. దీనిలో బాగంగా 1098 సర్వీసెస్ గురించి అవగాహ కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ పలాస ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె.శివాజి, చైల్డ్ లైన్ టీం మెంబెర్స్ డి.రమ, డి.జగదీశ్వరీ, కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: చైల్డ్‌లైన్ దోస్తీలో భాగంగా బెల్లుపడలోని బాలల దినోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. చైల్డ్‌లైన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.జాస్మిన్, మెంబర్సు ఝాన్సి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న రాజ్యలక్ష్మి

పాఠశాలకు పోడియం బహుకరణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలకు 1988-93 పూర్వ విద్యార్థులు రూ.30వేలు విలువ చేసే ఐదు పోడియంను బహుకరించారు. చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహాయ, సహకారాలు అందించడం జరిగిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైకుంఠరావు మాట్లాడుతూ భవిష్యత్ తరానికి పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. వెఉనకబడిన విద్యార్థులతో పాటు గ్రామస్తులు సహాయ సహకారాలు అందిస్తే పాఠశాల మరింత అభివద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మా కన్నపురం పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నల్ల శ్యామలరావు, కడగల హేమరాజు, ఎస్.బైరాగి, మల్ల ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

రాజకీయాల్లో చెరగని ముద్ర

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర గొర్లె హరిబాబు నాయుడని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. పాతర్లపల్లికి టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ హరిబాబు నాయుడు 72వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక రామతీర్థాలి కూడలిలో సోమవారం నిర్వహించారు. ముందుగా హరిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హరిబాబు కుమారుడు సాయిదీప్ నాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మేజర్ పంచాయతీ పొందూరులో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం పర్యటించనున్నట్లు మండల వైసిపి అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని ఎరుకులపేటలో రూ.12 లక్షలతో నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేయనురని పేర్కొన్నారు. అలాగే జలజీవన్ మిషన్‌లో భాగంగా ఎరుకులపేటలో రూ.16.40 లక్షలతోను, ఎరుకుల కాలనీలో రూ.16.40 లక్షలతో ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాలకు మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

నేడు ఎఎంసి సర్వసభ్య సమావేశం

పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్య సూత్రాలతో మధుమేహం దూరం

పలాస: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే డయాబెటిక్ దూరం చేయవచ్చని డాక్టర్ కణితి విశ్వనాథం అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో సోమవారం చిల్డ్రన్స్ డే, ప్రపంచ డయాబెటిస్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 120 మందికి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎన్.అప్పారావు, శారద దేవరకొండ, ఎల్.కొండలరావు, పి.సంజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల కాలనీల వద్ద జనసేన నిరసన



కవిటి : పాతకొజ్జిరియా వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - కవిటి

జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణం అసంపూర్ణంగా ఉన్నాయని, వాటిలో రోడ్లు, కాలువలు, విద్యుత్, నీటి సదుపాయం లేదని, తక్షణమే జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు రెండో రోజు సోమవారం నిరసన తెలిపారు. జగనన్న కాలనీలు అంటూ అభూత కల్పనలు, అరకొర నిర్మాణాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందని ఇచ్ఛాపురం జనసేన సమన్వయ కర్త దాసరి రాజు అన్నారు. కవిటి మండలంలోని కవిటి, పాత కొజ్జిరియా, బొర్రపుట్టుగలోని టిడ్కో కాలనీలు, జగనన్న కాలనీలను సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం కార్యదర్శి నాగుల హరిబెహరా, పనపాన లింగరాజు, రోకళ్ల భాస్కర్, అంగ సురేష్, దుగాన దివాకర్, బి.నేతాజీ, తదితరుల పాల్గొన్నారు.

సోంపేట: జనసేన నాయకులు దాసరి రాజు స్థానిక టిడ్కో ఇళ్లను పరిశీలించారు. మాణిక్యపురం, మండపల్లిలో జగనన్న కాలనీలను సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక జనసైనికులు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్ల, వరహాలగెడ్డకు ఆనుకొని ఉన్న జగనన్న కాలనీతో ఒక వైపు రైతులకు, మరోవైపు లబ్దిదారులకు నష్టం జరుగుతుందని జనసేన నాయకులు దుర్గారావు ఆందోళన వ్యక్తం చేశారు. వరహాల గెడ్డ వద్ద జగనన్న కాలనీని సోమవారం ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు జనసేన నాయకులు ఉన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీలోని జగనన్న ఇళ్ల కాలనీని జనసేన నాయకులు కోటేశ్వరరావు, సుధీర్ పరిశీలించారు. కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశ్వారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, సంతోష్, వినోద్, రమేష్, చందు, ప్రసాద్, జనార్ధన్, శ్రీను, ఉదయ్, పవన్, జన సైనికులు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జగనన్న ఇళ్ల పట్టాల పేరిట పేదలకు జరిగిన మోసాన్ని నిలదీయాలని నాయకులు కె.సాయిప్రతాప్, దుక్క బాలరాజు డిమాండ్ చేశారు. చాపరలోని జగనన్న ఇళ్ల స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు పిట్ట హరి, సవాలాపురం చంటి, రాకేష్, జగన్, సాయి పలువురు పాల్గొన్నారు.

పొందూరు: వైసిపి ప్రభుత్వం నివసించేందుకు అనుకూలంగా లేని, రాతి క్వారీ ప్రదేశాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని ఆమదాలవలస నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆరోపించారు. మండలంలోని తోలాపి, పొందూరు, రాపాక గ్రామాల్లో జగనన్న ఇళ్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈయనతో పాటు మండల నాయకులు, సూర్య, రమణ, చిన్నంనాయుడు, రఘు, సురేష్, మధు, గణేష్, జగదీష్, బాలకృష్ణ ఉన్నారు.



మెళియాపుట్టి : నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న జనసేన నాయకులు



పొందూరు : నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు